క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కు సన్మానం



మల్లారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ సర్పంచ్‌గా ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సాధ మల్లారెడ్డిని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు బాలేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కృష్ణగౌడ్, శేఖర్‌రెడ్డి, బండారి కృష్ణ, అరవింద్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, వినోద్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు.

స్నేహపూర్వక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

కందుకూరు: వారంతా చిన్ననాటి స్నేహితులు. కలిసిమెలిసి ఆటలాడుతూ చదువుకున్నారు. పెరిగి పెద్దయి ఎవరికి వారు స్థిరపడ్డారు. ఇంతలోనే తమతో పాటు చదువుకున్న మిత్రుడు అకాల మృతి చెందడంతో చలించిపోయారు. కందుకూరుకు చెందిన భానుచందర్ ప్రమాదవశాత్తు గత నెల 18న మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 2008–09 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ నగదును ఆదివారం స్నేహితుడి భార్యకు అందించి తమ స్నేహాన్ని చాటుకున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ, నాయకులు

కందుకూరు: క్రీడల్లో గెలుపోటములు సహజమని సీఐ మక్బూల్‌జానీ, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిట్టా రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని దెబ్బడగూడలో డీపీఎల్ పేరుతో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలు దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి ఉపయోగపడతాయన్నారు. మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కె.విఘ్నేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు బి.నర్సింహ, జైపాల్‌నాయక్, రఘుగుప్తా, జాన్, శ్రీకాంత్, జంగయ్య, శ్రావణ్, కిరణ్, అరుణ్, మనోహర్‌గుప్తా పాల్గొన్నారు.

విద్యతో సమాజ వికాసం



వృద్ధులను సన్మానిస్తున్న ఎంపీటీసీ

కందుకూరు: సమాజ వికాసానికి విద్య ఎంతగానో దోహదపడుతుందని దాసర్లపల్లి ఎంపీటీసీ సభ్యురాలు ఇందిరదేవేందర్ అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థ సహకారంతో మండల పరిధిలోని దాసర్లపల్లిలోని బాల చైతన్య కేంద్రంలో ఆదివారం పిల్లలకు యోగాసనాల ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వృద్ధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిన్నతనం నుంచే యోగాను పిల్లలు నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని చెప్పారు. వృద్ధులను ప్రేమగా, గౌరవంగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజనీకాంత్, అశోక్, దేవందర్, శేఖర్, బాలరాజ్, కృష్ణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

మాడ్గుల సీఐగా విష్ణువర్ధన్‌రెడ్డి

మాడ్గుల: మాడ్గుల సీఐగా విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు మాడ్గుల సీఐగా పనిచేసిన రాజశేఖర్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. విష్ణువర్ధన్‌రెడ్డి స్పెషల్ బ్రాంచ్ నుంచి మాడ్గులకు సీఐగా బదిలీపై వచ్చారు. మాడ్గుల పీఎస్‌లో ఆదివారం బాధ్యతలు తీసుకున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డిను ఎస్ఐలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా సత్కరించారు.

అందుబాటులో భూసార పరీక్షలు

- గ్రామాల్లో మట్టి నమూనా సేకరణ
- అధిక లాభాలు గడించవచ్చంటున్న అధికారులు
- ఆసక్తి చూపని రైతులు
- పాత పద్ధతుల్లోనే సాగు



ఇబ్రహీంపట్నంలోని భూసార పరీక్ష కేంద్రం

ఇబ్రహీంపట్నం: భూమిలోని పోషకాల విలువలు తెలుసుకొని.. ఏఏ పంటలు ఎలాంటి సమయంలో వేసుకోవాలో నిర్ధారించుకునేందుకు రైతులకు అందుబాటులో భూసార పరీక్ష కేంద్రం పనిచేస్తుంది. పోషకాల ఆధారంగా ఏ భూమిలో ఏ పంటలు వేసుకోవాలో, ఎంత మోతాదులో.. ఎరువులు, పురుగుల మందులు ఉపయోగించాలో రైతులు గుర్తించేందుకు ఈ పరీక్షా కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంది. అయితే రైతుల్లో చైతన్యం కొరవడటంతో పాత పద్ధతులతోనే పంటల సాగు చేపట్టుతుండటంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంలేదు. డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో ఈ భూసార పరీక్ష కేంద్రం ఉంది. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధిలోని రైతులు ఈ కేంద్రంలో భూపరీక్షలు నిర్వహించుకునే వెసలుబాటు ఉంది. ఒక వ్యవసాయాధికారి, ఒక వ్యవసాయ విస్తారణాధికారి పర్యవేక్షణలో ఈ కేంద్రం పనిచేస్తుంది. ఆయా మండలాల్లో 80వేల ఎకరాల విస్తీర్ణం సాగుకు అనుకూలంగా భూమి ఉన్నప్పటికీ 35వేల ఏకరాల్లోనే ప్రతీ యేడు వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

సరైన అవగాహన లేక..:

గత కొన్నేళ్లుగా భూసార పరీక్ష కేంద్రం ఇక్కడ పని చేస్తున్నా... రైతుల్లో సరైన అవగాహన లేక భూ పరీక్షలు చేయించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. భూసారానికి అనుగుణంగా పంటలు వేసుకోకపోవడం, అధికంగా ఎరువులు వాడటంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు. మరో వైపు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. వ్యవసాయశాఖ మార్క్‌ఫెడ్ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఈ మట్టి పరీక్షలకు నిధులు మంజూరు చేస్తుంది. ఉచితంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో రైతులు భూసార పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడంలేదు.

గత నాలుగేళ్లుగా..

గత నాలుగేళ్ల కాలంలో ఒకసారి పరిశీలిస్తే.. 2017–18 సంవత్సరంలో 1817, 2019–20 సంవత్సరంలో 570, 2021–22 సంవత్సరంలో 2478, 2023–24 సంవత్సరంలో 2400 మట్టి శాంపిల్స్ సేకరించి భూసార పరీక్షలు నిర్వహించారు. ఇంకా ఎక్కువ మొత్తంలో మట్టి నమూనాలు పరీక్షలకు రావాల్సిన అవసరం ఉంది. ఇదిలావుంటే ఆయా మండలాల పరిధిలో ఎంపిక చేసిన గ్రామాల్లో వ్యవసాయాధికారులు ప్రదర్శన క్షేత్రాలు, క్షేత్ర దినోత్సవాలను నిర్వహిస్తూ మట్టి నమూనా పరీక్షలపై రైతులకు వివరిస్తున్నారు. అంతేగాక పచ్చిరొట్టె, జీవ ఎరువుల వాడకం, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణ తరగతులను కూడా నిర్వహిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఇబ్రహీంపట్నంలోని భూసార పరీక్ష కేంద్రంలో మట్టి నమూనా పరీక్షలు ఉచితంగా చేస్తారు. కొన్నేళ్లుగా ఇక్కడ ఈ కేంద్రం పనిచేస్తుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై రైతులను చైతన్య పరుస్తున్నాం. పరీక్షలు చేసి పంటసాగు చేస్తే ఎరువుల ఖర్చు తగ్గి పంట దిగుబడి పెరిగి రైతుకు లాభం చేకూరుతుంది. ఈ పరీక్షలకు వ్యవసాయ మార్క్‌ఫెడ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను అందజేస్తాయి. – సత్యనారాయణ, వ్యవసాయ సహాయ సంచాలకుడు, ఇబ్రహీంపట్నం

ఖర్చు కూడా తగ్గుతుంది



భూసార పరీక్షలతో భూమిలోని లవణాలు, భాస్వరం, పొటాషియం, జింక్ ఏ మోతాదులో ఉన్నాయో స్పష్టంగా తెలుస్తుంది. దానికి సరిపడా ఎరువులు వేసుకుంటే సరిపోతుంది. ఖర్చు కూడా తగ్గుతుంది. దిగుబడి ఎక్కువ వస్తుంది. భూసార పరీక్షలు చేయించుకునేందుకు రైతులందరూ ఇంకా ముందుకు రావడంలేదు. వ్యవసాయాధికారులు చెబుతున్నా పాత పద్ధతులతోనే రైతులు వెళ్తున్నారు. – అంజిరెడ్డి, రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, శేరిగూడ

సరిపడా ఎరువులు వాడాను



నాకు ఐదున్నర ఎకరాల భూమి ఉంది. మట్టి నమూనాలతో పరీక్షలు చేయించుకొని నా భూమికి తగ్గట్టుగా ఎరువులు వాడుతాను. వంకాయ, చామగడ్డ, ఆలుగడ్డ, టమాట, వరి తదితర పంటలను సాగుచేస్తాను. ఆర్గానిక్ ఎరువులనే ఎక్కువగా ఉపయోగిస్తాను. రైతులందరూ మట్టి పరీక్షలు చేయించుకొని పంటలు సాగుచేస్తే ఖర్చు తక్కువ రావడంతో పాటు లాభం ఎక్కువ ఉంటుంది. – జంగయ్య, రైతు, నాగన్‌పల్లి

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న సబితారెడ్డి తదితరులు

కందుకూరు: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ముందుకురావాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని గూడూరు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఓ ఆస్పత్రిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కందుకూరు మండలంలో మెడికల్ కళాశాల, ఆస్పత్రి ఏర్పాటుకు శంకుస్థాపన చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, ఇందిర, మాజీ సర్పంచ్ కాకి ఇందిర, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఎస్.వరలక్ష్మి, సీనియర్ నాయకులు దశరథ, లక్ష్మీనర్సింహారెడ్డి, సదానంద్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, ఆనంద్, కృష్ణ, నర్సింహ, సామయ్య, కార్తీక్, దీక్షిత్ రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: తుమ్మలూరు గేటు (శ్రీశైలం జాతీయ రహదారి)– మహేశ్వరం బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో బీటీ రోడ్డు పనులను ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ తుమ్మలూరు గేటు నుంచి మహేశ్వరం మండల కేంద్రం వయా తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనతకన జరగడంతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు నిర్మాణం ఎత్తు పెంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

పనుల పరిశీలన

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి ఆర్అండ్‌బీ అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణానికి నిధులు సరిపోకపోతే ఆర్అండ్‌బీ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, సిహెచ్.ప్రశాంత్‌రెడ్డి, దానియేల్, కొండల్‌రెడ్డి, రాజునాయక్, యాదగిరి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, శివ పలువురు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కేఎల్లాఆర్

కొత్తగూడ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు జంగారెడ్డి, మల్లేశ్, పార్టీ మండల కోఆర్డీనేటర్లు కృష్ణనాయక్, భూపాల్‌రెడ్డి, సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ప్రకటించారు. పార్టీ గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా సంజీవరెడ్డిని ఎన్నుకున్నారు. ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడిగా కృష్ణయ్య, బూత్ కమిటీ అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్, దేవేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఎండీ ఖదీర్, శంకర్‌గౌడ్, ఎస్.పాండురంగారెడ్డి, ఆనంద్‌రెడ్డి, లక్ష్మీపతిగౌడ్, ఎండీ షకీల్, ఎస్.సురేశ్, దేవేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ యూత్ కమిటీ ఎన్నిక

మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో కాంగ్రెస్ యూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ గ్రామ పార్టీ అధ్యక్షుడు దేరంగుల నర్సింహా, సీనియర్ నాయకుడు చిన్న నర్సింహా ఆధ్వర్యంలో ఆదివారం కమిటీని ప్రకటించారు. గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, నందిగామ నగేష్, ఆలూరి నరేష్, ప్రధాన కార్యదర్శిగా విష్ణు, కోశాధికారిగా సాయికుమార్, కార్యదర్శులుగా రాఘవేందర్, లోకేశ్, ప్రచారకార్యదర్శిగా వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు. సభ్యులుగా ఒంగూరి వెంకటేశ్, ఆలూరి జంగయ్య, బొమ్మరాజు జంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, దేరంగుల వెంకటేశ్, ఆలూరి చంద్రశేఖర్, నందిగామ శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బొమ్మరాజు రాములు, గండు రవి, చిర్ర పాండు, విజేందర్, పాండు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చిత్ర లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ చిత్ర లేఅవుట్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెనెట్ డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఉచితంగా థైరాయిడ్, కొలెస్ట్రాల్, బీపీ ఇతర రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చిత్ర లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సత్యనారాయణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోదా కృష్ణారెడ్డి, యాదగిరిరావు, టెనెట్ ప్రతినిధులు శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో ఆదివారం అహోబిల రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం సమతాదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో అష్టలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 25, క్యారెట్ 21, దొండ 44, ఆలు 21, ఉల్లి 20, గోకర 50, దోస 18, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 45, అర్వి 57, మునగ 65, చిలగడదుంప 60, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 50, కాప్సికమ్ 55.ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నిర్దిష్టమైన ప్రణాళికలతో అభివృద్ధి పనులు

మన్సూరాబాద్: నిర్దిష్టమైన ప్రణాళికలతో డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో రూ.1.92 కోట్లతో చేపడుతున్న వరద నీటి కాలువ పనులను ఆదివారం సెంట్రల్ బ్యాంక్ కాలనీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చంద్రపురి కాలనీలోని రోడ్ నం.5 నుంచి సెంట్రల్ బ్యాంక్ కాలనీ మీదుగా కాకతీయ స్కూల్ వరకు వరద నీటి కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. నాయకులు కడారి యాదగిరి యాదవ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసానికి వేళాయె

- ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానానికి ముహూర్తం ఖరారు
- ఈనెల 22న శేరిగూడ సంఘం కార్యాలయంలో సమావేశం



ఉప్పరిగూడ సహకార సంఘం కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్‌పై డైరెక్టర్లు ఇచ్చిన నోటీసులకు అవిశ్వాస ముహూర్తం ఖరారయ్యింది. ఈనెల 22న శేరిగూడలోని ఆ సంఘం కార్యాలయంలో అవిశ్వాస సమావేశాన్ని ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. సంఘంలోని 13 మందిగాను 11 మంది సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించాలని జిల్లా కోఆపరేటివ్ అధికారిణి ధాత్రిదేవికి అవిశ్వాస నోటీసును గతనెల 31న ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం అయింది. ఈ మేరకు డైరెక్టర్లకు సమాచారాన్ని అందజేశారు. డీసీఓ ధాత్రిదేవి ఆధ్వర్యంలో ఈ అవిశ్వాస సమావేశం జరిగే అవకాశం ఉంది. కాగా చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొమ్మిది మంది సభ్యులు వ్యతిరేకిస్తే వారు పదవులు కోల్పోతారు. కాగా బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్ ఈ అవిశ్వాసాన్ని ఎలా ఎదుర్కొంటారో వేచి చూడాలి.

తోటి మనిషిలో దేవుడిని చూడాలి



వేడుకల్లో పాల్గొన్న కార్డినల్ ఆంథోని, పాస్టర్లు


- కార్డినల్ పూల ఆంథోని
- ముగిసిన బాలయేసు వార్షిక మహోత్సవాలు

తుర్కయంజాల్: తోటి మనిషిలో దేవుడిని చూసినప్పుడే మన కుటుంబంతో పాటు సమాజం బాగుంటుందని హైదరాబాద్ అతి మేత్రాణులు కార్డినల్ పూల ఆంతోని అన్నారు. పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని అద్భుత బాలయేసు పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న వార్షిక మహోత్సవాలకు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక, శారీరక, ఆర్థిక రుగ్మతలతో బాధపడుతున్న ఎంతోమంది బాలయేసు వద్దకు వచ్చి వ్యక్తిగత ఎదుగుదల, సమాజ ఎదుగుదల కొరకు పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తున్నారని, మనం పవిత్రంగా ఉండి, ఇతరులకు, సమాజానికి మంచి జరగాలని కోరుకోవాలని సూచించారు. దినదినాభివృద్ధి చెందుతున్న బాలయేసు పుణ్యక్షేత్రం అభివృద్ధిలో ఇప్పటివరకు పనిచేసిన ఫాదర్‌లు, చర్చి కమిటీ సభ్యుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు.

మూడు భాషల్లో బలిపూజ..

బాలయేసు ఉత్సవాల్లో భాగంగా ఉదయం 4 గంటల నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. తెలుగు, తమిళ, ఇంగ్లీష్ భాషల్లో దివ్య బలిపూజను నిర్వహించారు. ఉదయం 6 గంటలకు నగరంలోని బోయిగూడ నుంచి బాలయేసు తేర ప్రదక్షిణ ప్రారంభమయ్యింది. కమ్మగూడకు చేరుకోగానే చర్చి కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు స్వాగతం పలికారు. వేల సంఖ్యలో భక్తులు హాజరై బాలయేసును దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లను చేశారు. పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. దీంతో ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు ముగిసాయి.

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే మల్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆదివారం యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోనే యాచారం మండలానికి అత్యధికంగా రూ.4కోట్ల 58లక్షల ఈజీఎస్ నిధులు మంజూరు చేయించినందుకు గాను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యులు కొర్ర జ్యోతి, లక్ష్మీపతిగౌడ్, మాజీ ఎంపీపీ రమావత్ జ్యోతినాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు అమృతాసాగర్, శేఖర్‌గౌడ్, నారాయణరెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: పార్లమెంట్ ఎన్నికల్లో ఉనికి కోసం విపక్షాల అవకాశవాద రాజకీయాలు సాగిస్తున్నాయని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలకు మరింత చేరువైంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారం కోల్పోయామన్న అక్కసుతో రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు కుట్ర రాజకీయాలకు విష ప్రచారాలకు తెర లేపాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం, అభివృద్ధి పనులు, పథకాల అమలులో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని బీఆర్ఎస్ నాయకులు భయంతో ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఆ పార్టీ నాయకులు ప్రజాధనాన్ని దోచుకుని, దాచుకున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే ప్రజలకు సమన్యాయం సాధ్యమన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు జాంగీర్ బాబా, నాయకులు రామచందర్ నాయక్, యాదయ్య, శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగుల దశరథం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌లో హైదరాబాద్‌లోని విశ్వాస్ ఆస్పత్రి వారి సౌజన్యంతో కానుగుల దశరథం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్, అస్తమా, జలుబు తదితర తాత్కాలిక జబ్బులతో పాటు గుండె, కిడ్నీలు, వెన్నునొప్పి, దయాల సిస్ తదితర శాశ్వత రోగాలకు పరీక్షలు నిర్వహించారు. సుమారు 430 మంది రోగులను పరీక్షించి రూ.50వేలు విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేష్, ప్రకాశ్‌గౌడ్, ఆదర్శ్ యాదవ్, భరత్, శివకుమార్, బోదాస్ శ్రీకాంత్, మణికంఠ, వైద్యులు పాల్గొన్నారు.

మహతి పాలి క్లినిక్‌లో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని మహతి పాలి క్లినిక్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో డాక్టర్ శేషం శ్రీనిధి ఆధ్వర్యంలో 90 మంది మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సోమరాజు, యాదగిరి, మహతి పాలి క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.